# ద్రోహం

రవీ, నేనూ, వెంకటేశ్వర్లూ మెడిసిన్‌లో క్లాసుమేట్స్‌ము. అయిదేళ్ళు రూం మేట్సుము.

రవి అంటే నా కెంతో యిష్టం. అతను గొప్ప మిత్రుడు. కోటీశ్వరుల బిడ్డ. వాళ్ళ నాన్నకు బంగారం పండే భూములూ, లక్షలు లక్షలు సంపాదించిపెట్టే రైసుమిల్లులూ, మరేవో రకరకాల వ్యాపారాలున్నాయి. అయినా నన్నూ, వెంకటేశ్వర్లునూ చాలా దగ్గరి మనుషులుగా చూసుకొనేవాడు. అతను నాకు చేసిన సాయం మరువలేంది. వెంకటేశ్వర్లుకు చేసిన సాయం సాటిలేనిది.

చదువుకునే రోజుల్లో, రవి ఎన్నోమార్లు నన్ను ఆదుకున్నాడు. పంటలు పండకో, మరే యిబ్బందులు ఎదరయ్యే సమయానికో మావాళ్ళు నెలనెలా ఇంటి దగ్గర నుండి డబ్బు పంపలేక ఆలస్యం చేసేవారు. అటు వంటి సమయాల్లో రవి, నేను అడిగినంతా యిచ్చేవాడు. పైగా ఆ అయిదేళ్ళూ తన స్కూటర్‌ను దాదాపు నా చేతుల్లోనే వుంచాడు. ఇక అతనితోపాటు కార్లో ఎక్కని రోజూలేదు. తిరగని చోటూ లేదు.

ఇప్పుడు యీ గవర్నమెంట్ డాక్టర్ ఉద్యోగం రావడానికి తోడ్పడింది రవే. ఒకటి రెండు ట్రాన్సఫర్లలో కూడా సాయం చేసింది రవే. వచ్చే జీతంతో, ప్రైవేటు ప్రాక్టీసు పై సంపాదనతో హాయిగా వుంటున్నా. చదువుకునే రోజుల్లో రవి యిచ్చిన రెండు వేలు నేనింకా తిరిగి యివ్వలేదు. అతను అడగలేదు. అటువంటి వాళ్ళ డబ్బుతో అదృష్టం కలసి వస్తుంది.

వెంకటేశ్వర్ల నయితే పూర్తిగా చదివించింది రవే. వాడికి డాక్టరు డిగ్రీ వచ్చిందంటే రవి చలవే. బట్టలు కుట్టించాడు. పుస్తకాలు కొని యిచ్చాడు; ఫీజులు కట్టాడు. స్కాలర్‌షిప్ చాలకపోతే వందలు వందలు అచ్చుకున్నాడు. మేం ముగ్గురం మెడికల్ కాలేజీ వదిలి ఇప్పటికి ఆరేళ్లయింది. ఈ మధ్యకాలంలో కూడా రవి మమ్మల్ని ఏనాడూ మరచిపోలేదు.

ఆ మధ్య నాలుగేళ్ల కిందట తన పెళ్ళికి పిలిచాడు. హైదరాబాద్‌లో పెళ్ళి. నేనూ, వెంకటేశ్వర్లూ కలిసే వెళ్లాం. ఎవరెవరో- గొప్పగొప్పవాళ్లు వచ్చిన పెళ్ళి అది. లక్షలు ఖర్చవుతున్న పెళ్ళి అది. ఆ పెళ్ళిలో రవి వాళ్ళ నాన్న మాపట్ల చూపిన ఆదరం తలుచుకుంటే తల తిరిగి పోతుంది. వాళ్ళ 'పోష్' హోటల్లో ఏర్ కండిషన్ రూం ఒకటి మాకు ప్రత్యేకించమని మేనేజర్‌తో చెప్పాడు. మమ్మల్ని బాగా చూసుకొమ్మని ఆదేశించాడు.

పెళ్ళి పూర్తయిన మరు నిముషమే వెంటేశ్వర్లు తనకేదో పని వుందని వెళ్ళి పోయాడు. నేను మాత్రం మూడు రోజులున్నాను. ఆ హోటల్లోని స్వర్గ సుఖాలన్నీ చవిచూశాను.

ఆరు నెలల కిందట తన చెల్లెలు పెళ్లికి విజయవాడ రమ్మని ఆహ్వానం పంపాడు. వెంకటేశ్వర్లు ఎందుకో రాలేదు. నేను మాత్రం వెళ్లి వచ్చాను.

రవి తమ ప్రపంచంలోకి రమ్మనే ఆహ్వానాలను ఎప్పుడూ కాదనను.

ఇంత గొప్ప స్నేహితునికి, వాళ్ల కుటుంబానికి ఇటీవల బ్రహ్మాండమైన కష్టం వచ్చింది. రవినీ, వాళ్ళ నాన్ననూ ప్రభుత్వం మీసా కింద అరెస్టు చేసింది. బియ్యం గోడౌన్లకు సీలు వేసింది. ఎంత నష్టమో? నేనయితే గుండెలు పగిలి చచ్చేవాణ్ణి.

ఇలాంటి కష్టంలో నేనేం సాయం చేయగలను; స్నేహధర్మంగా సానుభూతి చూపడం తప్ప? బాధపడడం తప్ప? మొదట హైదరాబాద్ వెళ్ళి రవినీ, వాళ్ళ నాన్ననూ పరామర్శించి వద్దామనుకున్నాను. దానితో చిక్కులేమైనా రావచ్చు. తాడేపల్లిగూడెంలో వున్న స్వరాజ్యాన్ని పలకరించి వస్తే ఆమెకు ఓదార్పుగా వుంటుంది. స్వరాజ్యం మా రవి భార్య. మాకు జూనియర్. కష్టాల్లో వున్న ఆమెకు గుండె ధైర్యం చెప్పి రావాలనుకున్నాను.

ఎలాగూ నెల్లూరు గుండా వెళ్ళాలి. అక్కడే గవర్నమెంట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లను కూడా పిలుచుకొని వెళ్తే బావుంటుందనిపించింది. తనకు అంత మేలు చేసిన రవిని వెంకటేశ్వర్లు మరిచిపోడు. కలసి వెళ్తేనే బావుంటుందనుకున్నాను.

సరిగ్గా బయలుదేరాలనుకున్న రోజే అర్జెంట్ ఆపరేషన్ ఒకటి నాకు పోస్టు అయింది. పైసా యివ్వని దరిద్రుని కేసు. మరో డాక్టరుకు ఆ కేసు పోస్టు చేయించి సెలవు పెట్టి గూడెం బయలుదేరాను.

నెల్లూర్లో వెంకటేశ్వర్లును కలిశాను. వాడిల్లు చూసి నాకు ఆశ్చర్యం వేసింది. ఎక్కడో గొందిలో ఒక చిన్న పనికిమాలిన ఇంట్లో వుంటున్నాడు. ఇంట్లో సామాన్లు అతి మామూలుగా వున్నాయి. బయట పడకుండా తెలివిగా వెనకేసుకొస్తున్నాడేమోనని అడిగాను.

"పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కన్పిస్తుంది"అంటూ గట్టిగా నవ్వాడు. ముండమోపి సామెత

రవి వాళ్ల ప్రస్తావన తెచ్చాను. ఇదీ వాడి కూత:

"మంచిపనే జరిగింది కదా; ప్రభుత్వాన్ని మెచ్చుకోవాలి!".

ఇట్లా అనేవాణ్ణి ఏమనాలి? రేపో మాపో నాకిట్లాంటి ఇబ్బందులు వచ్చినా, వీడు ఇలాగే కూతలు కూస్తాడేమో? నా పట్ల కూసినా అర్ధముంది. తన జీవితానికి ఒక దారి చూపిన రవి విషయంలో వాడి ధోరణి వింతగా వుంది. మాటలు ఘోరంగా వున్నాయి. ఆ మాటే అన్నాను.

వేదాంతిలాగా సమాధాన మిచ్చాడు:

"స్నేహం మీద ప్రేమతో రవి నన్ను ఉద్ధరించలేదు. చదువులో నా అవసరం వుండి నాకు సాయం చేశాడు. అంతే . వాడు రోడ్లంట తిరుగుతూవుంటే రాత్రిళ్ళు నిద్రనేది లేకుండా చచ్చీచెడి నోట్సులు రాసిపెట్టాను. పరీక్షల ముందు పాఠాలు చెప్పాను. గట్టిగా మాట్లాడితే నా

శ్రమకు నాకు దక్కింది తక్కువే. ఇందులో వాని దయాధర్మాలు లేవు; గొప్ప అంతకన్నా లేదు.

వెంకటేశ్వర్లుగాడి మాటలకు తల తిరిగింది. ఈ రకం తెలివితేటలు మొదట్లో లేవే? కృతఘ్నుడు!

సర్దుబాటుగా అన్నాను :

"అది సరేలేరా. ఎవడి గొప్ప వానికుంటుంది. రవి మన స్నేహితుడు. అతని భార్య స్వరాజ్యం మన జూనియర్. రవి జైలుపాలైతే స్వరాజ్యమెంత కృంగిపోతూ వుంటుందో? పాపం? వాళ్ల ఊరెళ్లి కనీసం ఆమెను పలకరించి వద్దాం. యిది తెలిస్తే రవి ఎంతో సంతోషిస్తాడు; ఎందుకయిన మంచిది వెళ్లివద్దాం."

"నేను రాను. కావాలంటే నువ్వు వెళ్ళు"

"ఏం?"

"ఇక్కడ వూళ్ళో కలరా విపరీతంగా వుంది. ముఖ్యంగా మురికి పేటల్లో గవర్నమెంట్ డాక్టర్‌గా నా అవసరం వాళ్ళకుంది ఇప్పట్లో"

"కారణం యిదేనా?"

"అవును యిదొక వృత్తిబాధ్యత; మరొకటి రవి కుటుంబానికి మన అవసరం ఏమీ లేదు. రవి జైల్లోవున్నా, వాళ్ళ నాన్న జైల్లో వున్నా స్వరాజ్యం తిండి లేక మాడదు. వాళ్ళింట్లో వాళ్ళు డబ్బుకు గతిలేక చావరు. జబ్బులో, వైద్యం లేక కుక్క చావు చావరు. వీళ్ళ కోసం ఏడ్చేంత తీరిక నాకు లేదు. నన్ను అడిగితే ఇట్లాంటి వాళ్ల ఆస్తులన్నీ ఇప్పుడే ప్రభుత్వం జప్తు చేయాలంటాను. అప్పుడు ఎవడి గొప్పనూ ఎవడూ భుజాన వేసుకొని వూరేగక్కర్లేదు."

అతికూతలు ! ఒళ్ళుమండి అన్నాను :

"నువ్వు మిత్రద్రోహివి"

"ప్రజా ద్రోహులకంటే నయమే కదరా?"

వెంకటేశ్వర్లు నిర్వికారత చూసి భయమేసింది. ○

● 28 సెప్టెంబర్ 1975, విశాలాంధ్ర దినపత్రిక ●